


8న అండర్- 12 క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న అండర్- 12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజ్జీ క్రికెట్ మైదానంలో జరిగే ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2012 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువపత్రం, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్, మూడేళ్ల మార్కుల జాబితా తీసుకురావాలన్నారు. క్రీడాకారులు వైట్ డ్రెస్, సొంత కిట్ తీసుకురావాలన్నారు.

భూ వివాదాలు పరిష్కారమయ్యేనా?



- జగనన్న రీ సర్వేతో రైతులకు 1బీ కష్టాలు
- ఫ్రీహోల్డ్‌తో పెత్తందార్లకే మేలు
- అడ్డు, అదుపు లేకుండా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- లెక్క తేల్చాలనుకుంటున్న కూటమి ప్రభుత్వం
- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు
- నెల రోజుల పాటు నిర్వహణ



శృంగవరపుకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): భూ అక్రమాల లెక్క తెల్చేందుకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భూ వివాదాలు లేని గ్రామాల కోసం ఈనెల 6 (శుక్రవారం) నుంచి వచ్చేఏడాది జనవరి 8 వరకు నెల రోజుల పాటు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. ఈ సదస్సుల్లో భూ సంబంధిత సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామంటున్నారు. వీటిని 45రోజుల్లో పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు ప్రతి మండలానికీ జిల్లాస్థాయి అధికారొకరు ప్రత్యేక అధికారిగా నియమించారు. గత వైసీపీ ప్రభుత్వం జగనన్న రీ సర్వేకు రూ.కోట్లు ఖర్చు చేసింది. ఈ రీ సర్వే ద్వారా రైతులకు అనేక విధాలుగా ప్రయోజనం కలుగుతుందని డబ్బా కొట్టింది. ఇప్పుడు రీసర్వే జరిగిన గ్రామాల నుంచి లెక్కలేనన్ని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రధానంగా 1బీలు జారీ కావడం లేదు. భూముల క్రయ, విక్రయాలకు రైతులు అవస్థలు పడుతున్నారు. అత్యవసరంగా డబ్బు అవసరమైతే రైతుకు భూమే ఆధారం. చేతిలో అమ్మేందుకు భూమి ఉన్నా విక్రయించుకోలేని పరిస్థితి. అవసరానికి వడ్డీవ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. రీసర్వే జరిగిన గ్రామాల్లో సర్వే నెంబర్ల స్థానంలో ఎల్‌పీఎంలను సృష్టించారు. ఇద్దరు కంటే ఎక్కువ మందికి కలిపి ఒకే ఎల్‌పీఎం నెంబర్‌లను ఇచ్చారు. ఇలా ఇచ్చిన రైతులకు 1బీలు జారీ కావడం లేదు. దీంతో సబ్‌డివిజన్ కోసం తహసీల్దార్, మీసేవ, గ్రామ వార్డు సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. సబ్‌డివిజన్ చేసుకొనేందుకు అదనంగా రూ.550 చలానా కట్టాలి. ఈతతంగమంతా పూర్తయి సబ్‌డివిజన్ చేసి తిరిగి ఒక రైతుకు ఒక ఎల్‌పీఎం నెంబర్ వచ్చేటప్పటికి నెల నుంచి రెండు నెలల కాలం పడుతోంది. రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా ఈ సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశముంది.



ఫ్రీహోల్డ్ భూముల చుట్టూ వివాదాలు

వైసీపీ ప్రభుత్వం ఇరవై ఏళ్లు పూర్తయిన అసైన్డ్ భూములకు ఫ్రీహోల్డ్ ఇచ్చింది. క్రయ, విక్రయాలు సాగించేందుకు భూ హక్కులను కల్పించింది. ఇలా జిల్లాలో 5,618.35 ఎకరాల భూమిని ఫ్రీహోల్డ్ చేశారు. కొన్ని చోట్ల జాబితాలోని భూములను కూడా ఫ్రీహోల్డ్ చేసినట్లు ఆరోపణలు వున్నాయి. కూటమి ప్రభుత్వం దీనిపై విచారణ చేయిస్తోంది. ఈ విచారణ కూడా ముందుకు సాగకపోవడంతో ఇటీవల జిల్లా కలెక్టర్ (మిగతా 8వ పేజీలో..)

- ఎస్.కోట మండలం మల్లివూడి గ్రామానికి చెందిన కేదారి రామోజీ, కేదారి రమణ, వంగల బంగారుబాబులు 1బీ కోసం మీసేవ కేంద్రానికి వెళ్లారు. మీభూమి పోర్టల్‌లో 1బీ కనిపించకపోవడంతో తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించారు. గ్రామంలో జగనన్న రీ సర్వే జరిగినందున మీ ముగ్గురికీ కలిపి ఒకే ఎల్‌పీఎం నెంబర్ ఇచ్చారని, 1బీ రాదని స్పష్టం చేశారు. సబ్‌డివిజన్ కోసం ఆ రైతులు చాలా రోజులు అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చింది.
- వేపాడ మండలం కొండగంగుబూడి గ్రామ పరిధిలో ఫ్రీహోల్డ్ జరిగిన వెంటనే 98.32 ఎకరాల భూమికి శృంగవరపుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌లు జరిగిపోయాయి. జిల్లాలో అత్యధికంగా ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ ఇక్కడే జరిగింది. ప్రభుత్వ రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి ఆర్.పీ సిసోడియా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌పైనా చర్యలు తీసుకున్నారు.
- మెంటాడ మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ భూమిపై 60మంది దళితలకు గతంలో పట్టాదారు పాసుపుస్తకాలు అందించారు. ఇటీవల వారు 1బీల కోసం మీసేవా కేంద్రాలకు వెళ్లారు. ఈ భూములు హోల్డ్‌లో వున్నట్లు అక్కడ చెప్పారు. ఇదే విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా డి.పట్టాలు ఇచ్చినట్లు గుర్తించారు. అవి చెల్లవని తేల్చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడి మేరకు వాటిని జారీ చేసినట్లు జిల్లా స్థాయి ఉన్నతాధికారి విచారణలో తేలింది. దాదాపు 500ఎకరాల భూమి కావడంతో భారీ కుంభకోణం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

గొట్లాం సదస్సుకు మంత్రి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూసమస్యలు పరిష్కారం కోసం ఈనెల 6 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. ఇప్పటికే మండలాల వారీగా తహసీల్దార్లు, ఆయా గ్రామ కార్యదర్శులు, రాజకీయ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. షెడ్యూల్ తయారు చేశారు. సదస్సులకు రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులను ఆహ్వానిస్తున్నారు. బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో శుక్రవారం నిర్వహించనున్న ప్రారంభ రెవెన్యూ సదస్సును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరుకానున్నారు. రాజాం నియోజకవర్గానికి తోటపల్లి భూసేకరణ యూనిట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు ఎల్.జోసెఫ్‌ను నియమించారు. బొబ్బిలి నియోజకవర్గానికి ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి నూకరాజు, చీపురుపల్లికి డీపీఎం రాజేశ్వరి, గజపతినగరానికి ఎస్‌డిసి ప్రమీలా గాంధీ, నెల్లిమర్లకు ఎస్సీ కార్పొరేషన్ ఈడి సుధారాణి, విజయనగరం, ఎస్.కోట నియోజకవర్గాలకు ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు పి.మురళీ కృష్ణను నియమించారు.

ఉత్కంఠ పోరులో చండీగఢ్ విజయం

- టీ- 20 క్రికెట్ టోర్నీలో ఒడిశాపై 2 వికెట్ల తేడాతో గెలుపు

టీ- 20 క్రికెట్ టోర్నీలో ఒడిశాపై చండీగఢ్ జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య గురువారం జరిగిన మ్యాచ్‌లో చండీగఢ్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన ఒడిశా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 పరుగుల స్కోర్ సాధించింది. 206 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన చండీగఢ్ జట్టు 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్ని అందుకుంది.



6లో

పండగలా ఉండాలని..

- రేపు మెగా పేరెంట్-టీచర్ సమావేశాలు
- పార్టీలకు అతీతంగా హాజరుకావాలన్నదే లక్ష్యం
- ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంత్రి లోకేశ్ లేఖలు
- దేశంలోనే తొలిసారిగా ఒకేరోజు సమావేశాలు

విజయనగరం కలెక్టరేట్/ రాజాం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య ఓ ఆత్మీయ వారధి నిర్మించాలన్న సదుద్దేశంతో ఈనెల 7న నిర్వహించనున్న మెగా పేరెంట్-టీచర్ సమావేశాలకు అంతా సమాయత్తం అవుతున్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా పండగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించా లని ఇప్పటికే రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ లేఖలు రాశారు. వార్డు సభ్యుల నుంచి ఎంపి వరకూ, సర్పంచి నుంచి ముఖ్యమంత్రి వరకూ ప్రజాప్రతినిధు లంతా రాజకీయాలకు అతీతంగా వారి వారి గ్రామాల్లోని పాఠశాలల్లో జరిగే సమావేశాల్లో పాల్గొనాలని కోరారు.

ఇదీ లక్ష్యం..

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అభ్యసనా సామర్థ్యాలు, క్రీడలు, విద్యార్థులకు కళల పట్ల ఉన్న ఆసక్తి తదితర అంశాలను ఉపాధ్యాయుల సమక్షంలో గుర్తించి చర్చిస్తారు. విద్యార్థులు మరింత పరిణతి చెందేందుకు, వారిని ప్రోత్సహించేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలను సైతం చర్చిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలకు దగ్గర చేయ డం ప్రధాన లక్ష్యం కాగా పాఠశాలల్లో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారానికి, పాఠశాలల అభివృద్ధికి విరాళాలిచ్చే తల్లిదండ్రులు, దోహదపడే పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద, సేవా సంస్థల్ని భాగస్వామ్యం చేయాలన్నది కూడా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రవ్యాప్త ంగా ఒకేరోజు నిర్వహించే టీచర్-పేరెంట్ సమావేశాలలో భాగంగా జిల్లాలో 1795పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు సారథ్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



తల్లిదండ్రులను పిలిచేందుకు రూపొందించిన ఆహ్వానపత్రం

రూ.35 లక్షలు మంజూరు

జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు-తల్లిదండ్రులతో నిర్వహిం చనున్న సమావే శాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేయనున్నారు. సమావేశాల నిర్వహణకు అవసరమైన ఫర్నిచర్, తాగునీరు, స్నాక్స్, మధ్యాహ్నం భోజనం కోసం నిధులు విడుదల చేశారు. సమావేశాలలో భాగంగా తల్లిదండ్రులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసేందుకు వీలుగా మండలాల స్థాయిలో మండల విద్యాశాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

విద్యార్థుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో భాగంగా ముందుగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డులను అందజేయనున్నారు. జిల్లాలో 3 నుంచి 19 సంవత్సరాల వయసున్న సుమారు 2,58,000 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించారు. 40 రకాలు పరీక్షలు నిర్వహించనున్నారు.

పండగ వాతావరణంలో సమావేశాలు

మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలను పండగ వాతావరణంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. సమావేశాలు ప్రతి ఒక్కరికీ ఒక మధుర స్మృతిని మిగిల్చిపోవాలి. విద్యార్థుల్లో స్ఫూర్తి రగల్చాలి. వారిలో సృజనాత్మకతను వెలికితీసి ప్రతిభకు పట్టం కట్టాలి. నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఉత్తీర్ణతను పెంచేందుకు ఈ సమావేశాలు దోహదపడాలి.

- అంబేడ్కర్, కలెక్టర్



సమన్వయంతో ముందుకెళ్దాం

- నెల్లిమర్ల కూటమి నేతల ప్రకటన

భోగాపురం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సమన్వయంతో ముందుకెళ్దామని కూటమి నాయకులు నిర్ణయించారు. జనసేన టీడీపీల మధ్య చోటుచేసుకున్న స్వల్ప విభేదాలకు స్వస్తి పలకారు. భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం గురువారం ఏర్పాటు చేసుకొన్నారు. ఈసందర్భంగా ఇటీవల జరిగిన పరిణామాలపై చర్చించుకొన్నారు. ఇకపై అందరం కలిసికట్టుగా వెళ్దామన్నారు. అభివృద్ధి, సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి నియోజకవర్గానికి నిధులు తీసుకురావడంపైనా చర్చించినట్లు తెలిసింది. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఎమ్మెల్యే లోకంనాగమాధవి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు, వివాఖ నార్త్ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నంనాయుడు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జనసేన కార్యాలయం ముందు కూటమి నేతలు

కొత్తవలసలో ప్రత్యేక రైళ్లకు హాల్ట్

కొత్తవలస, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నడుపుతున్న రెం డు ప్రత్యేక రైళ్లకు కొత్తవలసలో హాల్ట్‌ను రైల్వేశాఖ కల్పించింది. సంబల్‌పూర్, కొత్తవలస రోడ్డు మధ్య న డిచే (08311) వీక్లీ స్పెషల్ రైలు ప్రతి బుధవారం ఉదయం 11.35 నిమిషాలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి అదేరోజురాత్రి 8.13నిమిషాలకు కొత్తవలస చేరుకుంటుందని వాల్తేరు డివిజన్ సీనియర్ డీ సీఎం సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే రైలు ఈరోడ్డులో ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 1.45నిమి షాలకు బయలుదేరి కొత్తవలసకు శనివారం మధ్యాహ్నం 1.57 నిమిషాలకు చేరుకుంటుందని తెలిపారు. అలాగే భువనేశ్వర్- యశ్వంత్‌పూర్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు ప్రతి శనివారం రాత్రి 7.15 నిమిషా లకు భువనేశ్వర్‌లో బయలుదేరి కొత్తవలసకు అర్ధరాత్రి 1.05 నిమిషాలకు చేరుతుందన్నారు. యశ్వంత్ పూర్‌లో ప్రతిసోమవారం తెల్లవారుజామున 4.30 నిమిషాలకు బయలుదేరి కొత్తవలసకు మరుసటిరోజు మంగళవారం ఉదయం 5.20నిమిషాలకు చేరుకుంటుందన్నారు.



రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం

సీఎం చంద్రబాబుతో కలెక్టర్ అంబేడ్కర్



విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ధాన్యం సేకరణపై సీఎం చంద్రబాబు నాయుడు గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ మాట్లాడారు. గత నెల 5 నుంచి ధాన్యం సేకరణ ప్రారంభిచామని, ఇప్పటివరకూ 56,592 మెట్రిక్ టన్నులు సేకరించామని వివరించారు. జిల్లాలోని 369 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించి ధాన్యం సేకరిస్తున్నామన్నారు. తడిచిన ధాన్యం సమాచారం కూడా సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ జేడీ రామారావు పాల్గొన్నారు.

- ఈ నెల 7న జిల్లా అంతటా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ పండగలా జరగాలని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ఎంఈవోల, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు, ఉపాధ్యాయులు కలిసి స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించాలని చెప్పారు.



డోలీ కష్టాలు

శృంగవరపుకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండల గిరిజనులకు డోలీ కష్టాలు నిత్యకృత్యం. తాజాగా గురువారం ఎస్.కోట పంచాయతీ శివారు రేగ పుణ్యగిరి గ్రామానికి చెందిన గర్భిణి వంతలి అంజలికి సుస్తీ చేసింది. ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు డోలీ కట్టాల్సి వచ్చింది. కొన్ని గంటల పాటు ఆమెను మోస్తూ స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. డోలీపై ఐదు కిలోమీటర్ల దూరం నడిచారు.

● దట్టంగా కురుస్తున్న వైనం ● ఆస్తమా రోగులకు తప్పని అవస్థలు ● అప్రమత్తతే మేలంటున్న వైద్యులు

అమ్మో.. పొగమంచు!

రాజాం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ చలితీవ్రత ఎక్కువవుతోంది. దీనికితోడు రాత్రి పది గంటల నుంచి తెల్లవార్లూ పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం ఏడెనిమిది గంటల వరకూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రధానంగా ఆస్మా రోగుల వెతలు ఇన్నీ అన్నీ కావు. పొగమంచు ప్రభావం ప్రజలపైనే కాదు పంటలు, జీడి, మామిడితోటలు, పశుపక్ష్యాదులపై కూడా తీవ్రంగానే పడుతోంది.

రోగుల వెతలు

చిన్నారులు, వృద్ధులతో పాటు ఆస్మారోగులు ఓ వైపు చలికి మరోవైపు పొగమంచు ప్రభావంతో అల్లాడిపోతున్నారు. ఇంటిపట్టునే ఉండేవారి విషయాన్ని పక్కనపెడితే రెక్కాడితే గాని డొక్కాడని వర్గాలు గత్యంతరం లేక రాత్రి పొద్దుపోయే వరకూ పనిచేస్తూ ఉదయాన్నే విధులకు వెళ్లి రావాల్సి వస్తోంది. పొగమంచుకు గురై రోగాలబారిన పడుతున్నారు. ఉదయం సూర్యకిరణాలు దట్టంగా ప్రసరించే వరకూ ఆస్మా రోగులు బయటకు వెళ్లకూడదని, రాత్రివేళ తొందరగా ఇళ్లు చేరాలని వైద్యులు సూచిస్తున్నారు.

వాహన చోదకులూ పరాక్

పొగమంచు ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎదురుగా వస్తున్న వాహనం కూడా కనిపించని విధంగా దట్టంగా పొగ కురుస్తుండడంతో వాహన చోదకులు జాగ్రత్తగా ముందుకు సాగాల్సిన పరిస్థితి నెలకొంది. మరీ అత్యవసరమైతే తప్ప వాహనాలతో బయటకు వెళ్లకుంటే ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చన్న వాదన బలంగా వినిపిస్తోంది. చిన్నచిన్న పట్టణాలను పక్కనపెడితే జాతీయ రహదారిపై రోజంతా తిరుగాడే వాహనాల డ్రైవర్లు మాత్రం జాగ్రత్తగా ముందుకు వెళ్లాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలే ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. రాత్రి పొద్దుపోయాక, మంచు దట్టంగా కురిసే సమయాలలో పెద్ద వాహనాలను నిలిపివేయాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

తల్లడిల్లుతున్న ఆస్మా రోగులు

జిల్లా అంతటా ఆస్మా రోగులు తల్లడిల్లిపోతున్నారు. నవంబరు మొదలు ఫిబ్రవరి మొదటి వారం వరకూ చలి, మంచుతో ఇబ్బందులు పడుతున్న ఆస్మారోగులు పొగమంచు పుణ్యమాని మరింత అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ ప్రభావంతో ఆయాసం ఎక్కువై ఊపిరాడని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉబ్బసంతో బాధపడుతున్న చిన్నారులు సైతం ఇబ్బంది పడుతున్నారు.

ఆరోగ్యంపై ప్రభావం

డా. పి.ఎల్.ఎన్. రాజు, ఆస్మా వైద్యులు, రాజాం.

మంచు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. మంచులో ఎక్కువగా తిరిగితే శ్వాసకోశ, చర్మ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. హృదయ స్పందనలో మార్పు రావొచ్చు. గర్భిణులు, చిన్నపిల్లలు, మంచులోకి రాకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాలంటే తలకు, చెవులకు రక్షణ కలిగించే దుస్తులు వాడాలి. మంచులో నుంచి వచ్చిన వెంటనే వేడినీటితో స్నానం చేయడం మంచిది.



దట్టంగా కురుస్తున్న మంచు



రాజాం-పాలకొండ రోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

గుండె జబ్బులకు ఆస్కారం

యాభై ఏళ్ల పైబడిన వారు ఈసీజన్‌లో మద్యం సేవించకూడదు. ధూమపానం చేయకూడదు. చలిమంటలకు దూరంగా ఉండాలి. వీటివల్ల శరీరం నుంచి నీరు ఎక్కువగా యూరిన్ ద్వారా బయటకు పోయి డీ హైడ్రేషన్ సంభవిస్తుంది. గుండె జబ్బులకు గురయ్యే ప్రమాదం ఉంది. పొలం పనులకు వెళ్లాల్సి వస్తే ఖచ్చితంగా మాస్క్ వాడాలి. దుమ్ము, ధూళి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో అర్హులైన వైద్యుడ్ని సంప్రదించాలి.

- గార రవిప్రసాద్, ఎమ్‌డీ, జనరల్ మెడిసిన్

ఊపిరితిత్తులపై ప్రభావం

ఈ సీజన్‌లో చిన్నారుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా ఆస్మా ఉన్న పిల్లల పట్ల మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పొగమంచు, దుమ్ము, ధూళి వల్ల ఊపిరితిత్తులపై భారం పడే అవకాశాలు ఉన్నాయి. ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం అయిదు గంటల తరువాత ఇంట్లోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పండ్లరసాలు, బార్లీ, మజ్జిగ ఇవ్వడం మేలు. ఊపిరి పీల్చుకోవడంలో తేడా గమనిస్తే వైద్యసహాయం తీసుకోవాలి.

- కరణం హరిబాబు,
చిన్నపిల్లల వైద్య నిపుణులు, సామాజిక ఆసుపత్రి, రాజాం

కార్టూన్లతో సందేశం

● ఉపాధ్యాయుడు రామచంద్రరావుకు ప్రశంసలు


● ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లోనూ ఆయన కార్టూన్లకు చోటు

కొత్తవలస, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): వృత్తి రీత్యా ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడు. కార్టూన్‌లు గీయడం అంటే అమితమైన ఆసక్తి. సమయం దొరికినప్పుడల్లా సమాజ హితం కోరే కార్టూన్లు వేస్తుంటారు. కథనం ద్వారా చెప్పాలనుకునే సందేశాన్ని ఒక కార్టూన్ ద్వారా సులువుగా వివరించవచ్చునని బలంగా నమ్మిన ఆయన అదే బాటలో వెళ్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. కంటకాపల్లి పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ప్రేమ రామచంద్రరావు ప్రత్యేకత ఇది.

చిన్నతనం నుంచే చదువుతో పాటు కార్టూన్‌లు గీస్తూ ఉండేవారు. కార్టూన్‌లు తిండి పెట్టవని స్నేహితులు ఎద్దేవా చేయడంతో దానినే వృత్తిగా చేసుకుని సత్తా చాటాలని సంకల్పించుకున్నాడు. టీచర్ ట్రైనింగ్ తీసుకుని ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉద్యోగం సాధించాక తన టాలెంట్‌కు మరింత పదును పెట్టాడు. 2015 నుంచి పూర్తిస్థాయిలో కార్టూన్‌లు గీయడం మొదలు పెట్టారు. తాను వేసిన కార్టూన్‌లను రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో ముద్రించింది. అమెరికాలోని తానా సంస్థ తెలుగు భాషపై ప్రపంచ స్థాయిలో నిర్వహించిన కార్టూన్ పోటీల్లో బహుమతి గెల్చుకున్నారు. కరోనా సమయంలో ప్రజలు ఆ మహమ్మారి బారిన పడకుండా అప్రమత్తం చేయడానికి కార్టూన్‌లు గీశారు. స్వచ్ఛ భారత్, తెలుగు మీడియంను ప్రోత్సహించడం కోసం కార్టూన్‌లు వేశారు. మోటర్ సైకిల్ నడిపేవారు హెల్మెట్ ధరించకపోతే ఎటువంటి అనర్థాలు జరుగుతాయో వివరించే కార్టూన్‌లు కూడా వేశారు.







పాఠ్యపుస్తకాలపై ప్రచురించిన కార్టూన్

మెరుగైన సమాజం కోసం..

● రిటైర్డ్ టీచర్ స్ఫూర్తిదాయక సేవ

● 27 మండలాల్లో 248 పాఠశాలలకు వివేకానందుని పుస్తకాల వితరణ

● ద్విచక్రవాహనంపై అన్ని స్కూళ్లకు వెళ్లి నేరుగా పంపిణీ

బాడంగి/ బొబ్బిలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేసిన తరువాత కూడా పిల్లలు మెరుగ్గా తయారు కావాలని తపించారాయన. విద్యార్థులంతా నైతిక విలువలతో పెరగాలని ఆకాంక్షించారు. మెరుగైన సమాజం కోరుకుంటూ 27 మండలాల్లోని 248 పాఠశాలలకు స్వయంగా వెళ్లి వివేకానందుని పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన పేరు అనంత విశ్వేశ్వరరావు.

బాడంగి మండల కేంద్రానికి చెందిన విశ్వేశ్వరరావు 1989లో దత్తిరాజేరు మండలం రాజులరామచంద్రపురం పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. అనంతరం వివిధ పాఠశాలల్లో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా సేవలందించారు. 2021లో కొత్తవలస మండలం దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేశారు. అయినా మంచి విద్యార్థులను తయారు చేయడంలో తన కృషిని ఆపకూడదని భావించారు. ఓ బృహత్తరమైన ఆలోచనకు శ్రీకారం చుట్టారు. నేటి సమాజంలో చిన్నారుల నుంచి పెద్దల దాకా నైతికవిలువలు, దేశభక్తి, మానవతా విలువలు తరిగిపోతున్నాయని, వాటిని పరిరక్షించుకోవాలన్న తపనతో ఉడతాభక్తిగా తన వంతు కృషి చేయాలని సంకల్పించారు. ఉమ్మడి జిల్లాల్లోని పాఠశాలలకు స్వయంగా వెళ్లి పంపిణీ చేశారు. సమాజాన్ని చైతన్యపరచడంలో, దేశభక్తిని రగిలించి యువతను కార్యోన్ముఖులుగా చేయడంలో విశ్వవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన స్వామి వివేకానందుని సూక్తులు విద్యార్థులకు చాలా అవసరమని గుర్తించాడు విశ్వేశ్వరరావు. ఈ ఆలోచన వచ్చిందే తడవుగా వివేకానందుని సూక్తుల పుస్తకాలను కొనుగోలు చేశారు. వాటన్నింటినీ రోజుకు కొన్ని స్కూళ్ల చొప్పున ఎంపిక చేసుకుని ద్విచక్రవాహనంపై వెళ్లి ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు పంపిణీ చేశారు. వివేకానందుని బోధనల సారాన్ని విద్యార్థులకు వివరిస్తూ వారిలో ప్రేరణ కలిగించారు. అలా 27 మండలాల్లో 248 పాఠశాలలకు వెళ్లి "రోజుకో సూక్తి", "ధీర యువతకు" అనే రెండు పుస్తకాలను స్కూళ్లకు అందజేశారు.



పాఠశాలలకు పుస్తక వితరణ చేస్తున్న రిటైర్డ్ టీచరు విశ్వేశ్వరరావు (ఫైల్)

చేయిచేయి కలిపారు..

సీతంపేట రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మర్రిపాడు పంచాయతీ పరిధి మారుమూల గిరిజన గ్రామాలైన ఎగువ ద్వారబంధం, నమిడి ద్వారబంధం గ్రామస్థులు తమ రహదారిని తామే బాగు చేసుకున్నారు. గురువారం ఈ రెండు గ్రామాల గిరిజనులు కలిసి శ్రమదానంతో రహదారిపై ఉన్న గుంతలను పూడ్చారు. శాశ్వత రహదారి లేకపోయినప్పటికీ ఉన్న రహదారిని శ్రమదానంతో బాగుచేసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ గ్రామాలకు పక్కా రహదారి నిర్మించాలని వారంతా కోరుతున్నారు.



శ్రమదానంతో రోడ్డు బాగుచేసుకుంటున్న గిరిజనులు



సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా మార్గశిర గురువారం పూజలు

పాలకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం మొదటి గురువారం సందర్భంగా స్థానిక కోటదుర్గమ్మ ఆలయంలో మార్గశిర లక్ష్మీవారం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి అష్టోత్తర శతకలశభిషేకం, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకం, ము ద్రాటలు, పసుపు నీళ్లతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు వేమకోటి మణీల్‌శర్మ వేద మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నారు.



బౌలింగ్ చేస్తూ..

ఉత్కంఠ పోరులో చండీగఢ్ విజయం

● టీ-20 క్రికెట్ టోర్నీలో ఒడిశాపై గెలుపు

విజయనగరం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు స్పోర్ట్స్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ టీ- 20 క్రికెట్ టోర్నీలో ఒడిశాపై చండీగఢ్ జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య గురువారం జరిగిన మ్యాచ్‌లో చండీగఢ్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన ఒడిశా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఒడిశా జట్టు ఓపెనింగ్ బ్యాటర్ గౌరవ్ చౌదరి ధాటిగా ఆడి 39 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సులతో 74 పరుగులు చేయగా, మిడిలార్డర్‌లో ఆశీర్వాద్ స్వాన్ 22 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులతో 43 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్ సాధించడానికి కృషి చేశాడు. ఓపెనింగ్ బ్యాటర్ స్వస్తిక్ సమాల్ (20), సందీప్ పట్నాయిక్ (22), రాకేష్ పట్నాయిక్ (17) పరుగులతో రాణించారు. చండీగఢ్ జట్టు బౌలర్లలో జగ్జీత్‌సింగ్ సంధూ, నిఖిల్ శర్మ, రజన్‌భవ తలా రెండేసి వికెట్లు సాధించారు. అనంతరం 206 పరుగుల భారీ విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన చండీగఢ్ జట్టు 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్ని అందుకుంది. ఆఖరి వరకు హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ ఆఖరి ఓవర్ ఐదో బాల్‌కు సిక్సు కొట్టి జట్టుకు విజయాన్ని అందించాడు. ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అర్సలాన్ ఖాన్ అర్ధసెంచరీ (22 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులతో 51 పరుగులు), మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ అమ్రిత్‌లాల్ (28 బంతుల్లో 52 పరుగులు) అర్ధ సెంచరీలతో రాణించారు. గౌరవ్ పూరి చెలరేగి ఆడి 18 బంతుల్లో ఒక ఫోర్, 4 సిక్సులతో 37 పరుగులతో కదంతొక్కడంతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. చండీగఢ్ జట్టు బ్యాట్స్‌మన్ అర్సలాన్ ఖాన్‌కు 'ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్' అవార్డు లభించింది. ఈ విజయంతో చండీగఢ్ జట్టు ఖాతాలో 4 పాయింట్లు చేరాయి.





క్యాచ్ పట్టే సమయంలో ఒకరినొకరు ఢీకొన్న దృశ్యం



మైదానంలో క్రీడాకారులు ఆనందోత్సాహం

గోనె సంచులు అందుబాటులో ఉంచండి


తెట్టంగి గ్రామంలో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న మన్‌జీర్ జిలానీ

గుర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు గోనె సంచులు అందుబాటులో ఉంచాలని సివిల్ సప్లయిస్ ఎమ్‌డీ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. గురువారం ఆయన తెట్టంగి రైతుసేవా కేంద్రం, భరత్ ఆగ్రో ఫుడ్స్ మిల్లును తనిఖీ చేశారు. తెట్టంగి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు విషయమై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతాన్ని ఎలా తెలుసుకుంటారో చెప్పాలని సాంకేతిక సహాయకులను ప్రశ్నించారు. ఆ టీఏ తడబడడంతో గ్రామ వ్యవసాయ సహాయకులు తేమశాతం గురించి వివరించారు. ట్రక్ షీట్స్ ఏ విధంగా జనరేట్ చేస్తున్నారు? మిల్లుకు రవాణా చేసేందుకు వాడే వాహనాలకు జీపీఎస్ ఉందా? ఎన్ని వాహనాలు అందుబాటులో ఉన్నాయని ఆరా తీశారు. ఆర్‌ఎస్‌కే నుంచి 9 వాహనాలు అందుబాటులో ఉన్నాయని సిబ్బంది తెలిపారు. దళారులకు రైతులు ధాన్యం అమ్మకుండా చూడాలన్నారు. గ్రామాలలో దండోరా వేయించి రైతులలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పల్లిగండ్రేడు భరత్ ఆగ్రో ఫుడ్స్ మిల్లును తనిఖీ చేశారు. దీని యజమాని ఉప్పలపాటి రాజేష్‌వర్మతో మాట్లాడి మిల్లు సామర్థ్యం, ఇంతవరకు ఎంతమేరకు ధాన్యం సేకరించారు? తేమ శాతంపై ఆరా తీశారు. ప్రస్తుత తేమ శాతం సమస్య లేదని ఆయన తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జేసీ సేతు మాధవన్, తహసీల్దార్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

47 మంది హెల్త్ అసిస్టెంట్ల తొలగింపు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో 47 మంది హెల్త్ అసిస్టెంట్‌లను తొలగించారు. వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వీరిని సర్వీసు నుంచి తప్పిస్తున్నట్టు జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాణి తెలిపారు. వీరిని రిలీవ్ చేయాలని సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సీడీపీఓ బదిలీ

భోగాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భోగాపురం సీడీపీఓ, ఏసీడీపీవోలుగా విధులు నిర్వహిస్తున్న ఎస్తేర్‌రాణి, బి.టి.నాయుడులను అధికారులు బదిలీ చేశారు. గత కొంత కాలంగా వీరిద్దరి మధ్య వివాదాలు తారస్థాయికి చేరడం, ఇటీవల ఉన్నతాధికారులు విచారించడం జరిగింది. సీడీపీఓ ఎస్తేర్‌రాణిని పాడేరు, ఏసీడీపీఓ బీటీ నాయుడును విజయనగరం అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయానికి బదిలీ చేశారు.

నేడు మంత్రి పర్యటన

శృంగవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం జామి మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు కుమరాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశానికి హాజరవుతారు. మధ్యాహ్నం భీమసింగి సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తారు. సాయంత్రం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ముఖ్యనేతలతో సమావేశమవుతారు.

8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష జరగనుందని డీఈవో మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరగనుందన్నారు. వెబ్‌సైట్‌లో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

నేడు జాబ్‌మేళా

నెల్లిమర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న (శుక్రవారం) స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో తదితర విద్యార్హతలు ఉన్న యువతీ యువకులు ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. వయసు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. వివరాలకు 87905 00572, 99888 53335 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

నెల్లిమర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సారిపల్లి రూరల్ ఫీడర్ ఎల్.సి. మరమ్మతుల కారణంగా ఈ నెల 6న (శుక్రవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ త్రినాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. సారిపల్లి, నీలంరాజుపేట, తారకరామ ప్రాజెక్టు, సారిపల్లి వాటర్ వర్క్స్, కుదిపి గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

గడ్డి విత్తనాలు పంపిణీ

శృంగవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పచ్చిమేతతో పాల దిగుబడి పెరుగుతుందని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.వి.రమణ అన్నారు. గురువారం సన్యాసయ్యపాలెం గ్రామంలో యాక్షన్ ఫర్ ఫుడ్ ప్రొడక్షన్ (ఎఎఫ్‌పీఆర్‌ఓ) సంస్థ సహాయక డైరెక్టర్ చలపతిరావు, మేనేజర్ చుక్క శ్రీరాములు నాయుడు ఆధ్వర్యంలో 50 మంది రైతులకు సుగర్ గ్రేజ్ గడ్డి విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారిగా హేమసుందరరావు

చీపురుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక డివిజినల్ అభివృద్ధి అధికారి హేమసుందరరావు చీపురుపల్లి నోడల్ అధికారిగా నియమితులయ్యారు. ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతల నిర్వహణ కోసం కలెక్టర్ ఆయనను నియమించారు.

నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజాం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో శుక్రవారం ఉదయం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దీనిని ప్రారంభిస్తారు.

21 నుంచి ఎస్ఎఫ్ఐ మహాసభలు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు విజయనగంలో గురువారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గజపతినగరంలో ఎస్ఎఫ్ఐ మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చినబాబు, రవికుమార్, వెంకి పాల్గొన్నారు.

ఇకపై రోడ్లు లేని గ్రామాలు ఉండవు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

శృంగవరపు కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇక మీదట రోడ్లు లేని గ్రామాలు ఉండవని శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం ఎస్.కోట పంచాయితీ శివారు సీతంపేట గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాలను నిర్లక్ష్యం చేసిందన్నారు. రోడ్లు, డ్రైనేజీలను నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, నాయకులు కాపుగంటి వాసు, చెక్క కిరణ్ కుమార్, పెదగాడ రాజు, భీశెట్టి అరుణ, ఇందుకూరి శ్రీనురాజు, అనకాపల్లి చెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఆదుకోవాలి


నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

గరివిడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో విద్యార్థుల దాడిలో ప్రాణం పోయిన హిజాద్ ఉపాధ్యాయుడు అహమ్మద్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం నిరసన తెలిపారు. ఈమేరకు ఎంఈవో పి.రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులపై ఇలాంటి దాడులు చేయడం దారుణమన్నారు. దీనిపై ప్రభుత్వ యంత్రాంగం స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎం.రఘునాథరాజు, ఎ.సత్యశ్రీనివాస్, మీసాల వెంకట రమణ, టి.రాము పాల్గొన్నారు.

గోశాలను సందర్శించిన చినజీయర్


స్థానికులతో మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

గంట్యాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న గోశాలను త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి గురువారం రాత్రి సందర్శించారు. బొబ్బిలిలో జరగనున్న కార్యక్రమానికి వెళ్తున్న ఆయన గంట్యాడకు వచ్చి గోశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు, విద్యార్థులతో మాట్లాడుతూ గోవుల ఆవశ్యకత, ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ గోవులను పూజించాలని సూచించారు. ధర్మాన్ని కాపాడితే, మనలను ధర్మం కాపాడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచి మంచి భావాలను అలవాటు చేసుకోవాలని చినజీయర్ స్వామి హితవు పలికారు.

కాలుష్య సమస్యలపై డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు

రేగిడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంకిలి ఈఐడీ ప్యారీ షుగర్స్ డివిజన్, దాని అనుబంధ పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలు, ఇతర కాలుష్య సమస్యలపై అప్పాపురం మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ మెయిల్ ప్రతిని గురువారం స్థానిక విలేఖరులకు అందించారు. తనతో పాటు, సంకిలి సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, దేవుదళకు చెందిన కెంబూరు ధనంజయ్‌రావు, పుర్లికు చెందిన పాలవలస మురళీధర్‌లు సంకిలి, దేవుదళ, అప్పాపురం, లక్ష్మీపురం, ఆదవరం, కొమిరి, పుర్లి తదితర గ్రామాలకు కలుగుతున్న ఇబ్బందులను పవన్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఈ ప్లాంట్ అనర్థాలపై విచారణకు ఆదేశించాలని కోరామన్నారు.

జనసేనలో చేరిక

భోగాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే లోకంనాగమాధవి ఆధ్వర్యంలో తిప్పలవలసకు చెందిన పలువురు పార్టీలో చేరారు. వీరిలో వాసపల్లి కృష్ణ, నక్క సత్తయ్య, మూగి చీముడు, నక్క తోటయ్య, తదితరులు ఉన్నారు.

చెరకు మద్దతు ధరపై నిర్ణయం

శృంగవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భీమసింగి చక్కెర కర్మాగారం నుంచి సంకిలికి తరలిస్తున్న చెరకు దిగుబడితో సంబంధం లేకుండా టన్నుకు రూ.2,800 చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. ఈ మేరకు బొబ్బిలి చెరకు ఉప కమిషనర్‌తో గురువారం భీమసింగి కర్మాగారం ఎమ్‌డీ సమావేశమయ్యారు. నాట్లు వేసిన చెరకుకు ఎకరాలో 25 టన్నులు తోలినందుకు టన్నుకు రూ.200 రాయితీతో రూ.2,933, 20 టన్నులు తోలేందుకు రాయితీ రూ.100తో టన్నుకు రూ.2,833 చెల్లించేలా నిర్ణయం జరిగింది. రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయనున్నారు.

వైసీపీ నేతల పరామర్శ

గుర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో వరి పంట తీవ్రంగా నష్టపోయిన రైతుల కుటుంబాలను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. గూడెం గ్రామంలో నష్టపోయిన రైతు కుటుంబాలను పరామర్శించారు. పొలాలను పరిశీలించారు. మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఎంతో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల గురించి కనీసం పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కేవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ అప్పల నాయుడు, ఎంపీటీసీ ప్రతినిధి సన్యాసి నాయుడు, బంగారునాయుడు, కేశవరావు, తిరుపతిరావు, వ్యవసాయాధికారి తిరుపతి రావు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే ఉపేక్షించం

చీపురుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బడి పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే సహించబోమని మండల విద్యాధికారి ఎం. బూసినాయుడు స్పష్టం చేశారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనంలో పురుగులు పడిన అంశంపై పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించిన ఆయన గురువారం పాఠశాలను సందర్శించారు. హెచ్ఎం రహీనా బేగం, ఉపాధ్యాయ సిబ్బంది, నిర్వాహకులను విచారించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సంఘటనపై పూర్తి స్థాయి నివేదికను జిల్లా అధికారులకు పంపించామన్నారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రతి రోజు ఉపాధ్యాయులు తనిఖీ చేయాలని ఆదేశించామని తెలిపారు. దీని కోసం డ్యూటీలు వేయాలని చెప్పామన్నారు. నాణ్యమైన భోజనం అందించడంలో అలక్ష్యం ప్రదర్శించరాదని నిర్వాహకులను ఆదేశించామని ఎంఈఓ తెలిపారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో బాలుడి మృతి

- మృతదేహం తరలించేందుకు అంబులెన్స్ కరువు
- బస్సు, బైకుపై 70 కిలోమీటర్లు ప్రయాణించి స్వగ్రామానికి తరలించిన వైనం

కురుపాం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మూడేళ్ల బాలుడు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కురుపాం మండలం నీలకంఠాపురం గ్రామానికి చెందిన కొండగొర్రి అశోక్, స్వాతిల కుమారుడు కొండగొర్రి రోహిత్(3) తీవ్రంగా ఏడుస్తుండటంతో మంగళవారం నీలకంఠాపురం పీహెచ్‌సీలో చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రోహిత్ బుధవారం రాత్రి మృతిచెందాడు. అయితే మృతదేహం తరలించేందుకు ఆస్పత్రి వద్ద అంబులెన్స్ అందుబాటు లేని కారణంగా నిరుపేద అయిన అశోక్.. తన కొడుకు మృతదేహాన్ని తీసుకుని బస్సులో 35 కిలోమీటర్లు ప్రయాణం చేసి కురుపాం చేరుకున్నారు. అక్కడి నుంచి నీలకంఠాపురానికి వెళ్లేందుకు ఆ సమయంలో బస్సులు లేవు. దీంతో అతని స్నేహితుడు మోటారు సైకిలుపై కొడుకు మృతదేహంతో మరో 35 కిలోమీటర్లు ప్రయాణం చేసి నీలకంఠాపురం చేరుకున్నారు. కాగా, అశోక్, స్వాతి దంపతులకు మొదటి సంతానంగా నాలుగేళ్ల కిందట కుమారుడు పుట్టాడు. అయితే ఆ బిడ్డ పురిట్లోనే ప్రాణాలు వదిలాడు. రెండో సంతానంగా పుట్టిన రోహిత్ మూడేళ్లకే కాలం చేయడంతో ఆ దంపతులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సాలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లాకు చెందిన సీహెచ్ సురేష్(48) సుమారు ఐదు సంవత్సరాల నుంచి ప్రతి సంక్రాంతి పండగకు సుమారు 45 రోజులు ముందుగా సాలూరు వచ్చి స్థానిక లక్ష్మీ థియేటర్ ఎదురుగా బట్టలు అమ్ముతూ ఉంటాడు. అలాగే ఈ ఏడాది కూడా నాలుగు రోజుల కిందట కర్నూలు నుంచి సాలూరు చేరుకుని రామాకాలనీలో ఉంటూ బట్టల వ్యాపారం మొదలు పెట్టాడు. అయితే గురువారం రూంలో ఉంటూ స్నానం చేసిన తర్వాత తువ్వాలు ఆరబెడుతుండగా విద్యుత్ తీగ ఆ చువ్వకు తగలటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కూమారులు ఉన్నారు.

రైలు ఢీకొని యువకుడు..


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

పాలకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన పప్పల ప్రవీణ్‌కుమార్(19) అనే యువకుడు బెంగళూరులో రైలు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రవీణ్‌కుమార్ ఐటీఐ పూర్తి చేసి ఏదైనా ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం సంపాదించి కుటుంబానికి ఆసరాగా ఉందామని రెండు నెలల కిందట బెంగుళూరు వెళ్లాడు. రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెందాడు. తండ్రి పప్పల సింహాచలం ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తల్లి రాజు గృహిణి. ప్రవీణ్‌కుమార్ మృతి విషయం తెలియగానే తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇందిరానగర్ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

కురుపాం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కురుపాంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సీసీ కెమెరాలు బిగించేందుకు వెళ్లిన టెక్నీషియన్ పాలక మురళీధర్(38)కు హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. కురుపాంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం తరలించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు


స్వాధీనం చేసుకున్న నగలు, నిందితుడితో పోలీసులు

విజయనగరం క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం తోటపాలెంలో దొంగతనాలకు పాల్పడిన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంతర్రాష్ట్ర దొంగను గురువారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 20న తోటపాలెంలోని నాలుగు ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఈ నెల 4న రాత్రి పట్టణంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అదుపులోకి తీసుకొని విచారించామని చెప్పారు. నాలుగిళ్లలో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. అతని నుంచి 400 గ్రాముల వెండి వస్తువులు రికవరీ చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఈకేసులో మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

నాటు సారా స్వాధీనం

రేగిడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మీసాలడోలపేట గ్రామతోటల్లో గురువారం అదే గ్రామానికి చెందిన టి.రవికుమార్ నుంచి 1.8 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు రాజాం ఎక్సైజ్ సీఐ జైభీమ్ తెలిపారు. సీతంపేట నుంచి నాటుసారా తెచ్చి ప్యాకెట్లతో విక్రయాలు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్టు వివరించారు.

పశువుల లారీలు...


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

దత్తిరాజేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదమానాపురం సంతకు పార్వతీపురం నుంచి మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 26 పశువులను గురువారం పట్టుకున్నట్టు ఎస్ఐ జయంతి తెలిపారు. పశువులను హింసించి వాటికి ఇబ్బంది కలిగించే రీతిలో రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణా చేసిన వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు.

సిరిపురంలో నగదు చోరీ

సంతకవిటి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిరిపురం గ్రామంలో డి.పార్వతికి చెందిన ఇంట్లో ఓ వ్యక్తి రూ.పదివేలు దొంగిలించాడు. బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో చర్చికి వెళ్లి..వచ్చేలోపు అదే గ్రామానికి చెందిన అప్పారావు తన ఇంట్లో కనిపించినట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు మండల కేంద్రంలో సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేస్తున్నారు. కట్టు దిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్టు ఎస్ఐ గోపాలరావు తెలిపారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం


కొత్తవలస: సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి విజయ్ చందర్


గజపతినగరం: మాట్లాడుతున్న న్యాయాధికారి కనకలక్ష్మి

కొత్తవలస, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు మధ్య వర్తిత్వం వహించి పెండింగ్ కేసుల పరిష్కారానికి సహకరించాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సముద్రాల విజయచందర్ అన్నారు. గురువారం కొత్తవలస కోర్టు హాలులో ఆయన అధ్యక్షత న్యాయవాదులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో న్యాయవాదులు మధ్యవర్తిత్వం వహించి.. కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు. మధ్యవర్తిత్వం వహించడానికి ముందుకు వచ్చే న్యాయవాదులకు జనవరిలో శిక్షణ ఇస్తామన్నారు. సివిల్ కేసులతో పాటు వివాహ సంబంధమైన కేసులు, రాజీకి వీలుపడే క్రిమినల్ కేసులను రాజీ చేసేందుకు ఇరుపార్టీలను ఒప్పించలసి ఉంటుందన్నారు. ఈ నెల 14న జరిగే మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల రాజీకి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షురాలు డీవీఎల్ దేవి, న్యాయవాదులు రామచంద్రప్రసాద్, గొడుగుల మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

గజపతినగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారానికి రాజీయే రాజమార్గమని న్యాయాధికారి కనకలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక కోర్టులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో పెండింగ్ కేసులను పరిష్కరించాలని న్యాయవాదులకు ఆమె సూచించారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోకుండా కేసులను పరిష్కరించుకునేలా చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బిట్ర సూర్యారావు, రెడ్డి శ్రీనివాసరావు, కలిశెట్టి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా?

● అడుగడుగునా గోతులు..
● ఇబ్బందులు పడుతున్న బొబ్బిలి పట్టణ వాసులు

బొబ్బిలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రాంతంలో రహదారులన్నీ అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. ముఖ్యంగా బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి కాలేజీ రోడ్డు, పూల్‌బాగ్ మీదుగా వెళ్లే రహదారి గుంతలమయంగా దర్శనమిస్తోంది. మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోక పోవడంతో ఈ గుంతలు మరింత పెద్దవై ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, రాజా కాలేజీ గేటు, విద్యుత్ డివిజన్ కార్యాలయం, పూల్‌బాగ్, బైపాస్ రోడ్లలో ఇలా అనేక చోట్ల గోతులు ఏర్పడ్డాయి. సంక్రాంతికల్లా రోడ్లన్నిటినీ చక్కగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ప్రజలు సంతృప్తి చెందడం లేదు. రోడ్ల పరిస్థితిపై పెదవి విరుస్తున్నారు.


ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో..


ఇదీ కాలేజీ రోడ్డు దుస్థితి

శ్యామలాంబ పండగను వైభవంగా నిర్వహిద్దాం

● మంత్రి సంధ్యారాణి


మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్యామలాంబ పండుగను వైభవంగా నిర్వహిద్దామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక శ్యామలంబ అమ్మవారి ఆలయంలో పట్టణ ముఖ్యనాయకులు, పెద్దలతో ఆలయ అనువంశిక ధర్మకర్త విక్రమచంద్ర సన్యాసిరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. పండగ నేపథ్యంలో తాగునీటి సమస్య లేకుండా వార్డుల్లో ఉన్న ట్యాంకులకు మరమ్మతులు చేస్తున్నామని చెప్పారు. అలాగే పట్టణంలో మరో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు మంత్రి దృష్టికి తీసుకు వెళ్లామని తెలిపారు. పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఎ.అప్పారావును నియమించామని, అలాగే 29 వార్డులకు చెందిన కౌన్సిలర్లు ఉపాధ్యక్షులుగా ఉంటారని తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా నిమ్మాది తిరుపతిరావు(చిట్టి) ఉంటారన్నారు. అనంతరం కమిటీ సభ్యుల పేర్లను, సలహా సంఘం సభ్యుల పేర్లు చదివి వినిపించారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, జర్జాపు సూరిబాబు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చట్టరీత్యా నేరం

● విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి


పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న దృశ్యం

పాలకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి పండించడం, రవాణా చేయడం, సేవించడం చట్టరీత్యా నేరమని విశాఖరేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన పాలకొండ డీఎస్పీ కార్యాలయం సర్కిల్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గంజాయి, మాదక ద్రవ్యాలు వినియోగించే వారికి తీవ్రమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకు ముందు సంకల్పం కార్యక్రమంపై పోలీస్ సిబ్బందికి, స్థానికులకు అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. డీఎస్పీ కార్యాలయం వద్ద గౌరవ వందనం స్వీకరించారు. ఆయనతో పాటు ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎం.చంద్రమౌళితో పాటు డివిజన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

● కురుపాం రూరల్: కురుపాం, నీలకంఠాపురం పోలీసు స్టేషన్లను విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి గురువారం సందర్శించారు. స్టేషన్లలోని రికార్డులు తనిఖీ చేశారు. శాంతిభద్రతల పరిస్థితి సమీక్షించారు. ఎస్పీ, డీఎస్పీ తోపాటు సీఐలు హరి, తిరుపతిరావు, ఎస్ఐలు నారాయణరావు, నీలకంఠరావు పాల్గొన్నారు. ● సీతంపేట రూరల్: సీతంపేట పోలీస్‌స్టేషన్‌ను డీఐజీ గోపీనాథ్‌జెట్టి తనిఖీ చేశారు. పాలకొండ సీఐ చంద్రమౌళి, ఎస్ఐ వై.అమ్మన్నరావు ఉన్నారు.

మూడు లారీల సీజ్

బొబ్బిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు నుంచి రాయగడకు అధిక లోడుతో వెళ్తున్న మూడు లారీలను బొబ్బిలి పోలీసులు గురువారం రాత్రి అడ్డుకున్నారు. స్థానిక గ్రోత్‌సెంటర్ సమీపంలో మాంగనీస్ ఓర్‌తో వెళ్తున్న రెండు లారీలు, లైమ్‌స్టోన్‌తో వెళ్తున్న ఒక లారీని సీఐ కటకం సతీష్‌కుమార్ పట్టుకుని సీజ్ చేశారు. సీజ్ చేసిన లారీలను జిల్లా రవాణా శాఖాధికారికి అప్పగించారు. 23 టన్నులతో ఉన్న రెండు లారీలకు రూ.66వేలు చొప్పున, 11 టన్నుల వాహనానికి రూ.42 వేలు చొప్పున జరిమానా విధించినట్టు రవాణా శాఖాధికారి దుర్గాప్రసాద్ తెలిపారు.

ఉపాధి అక్రమాలకు స్వస్తి పలకాలి

గరుగుబిల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో నెలకొన్న అక్రమాలకు స్వస్తి పలకాలని ఎంపీపీ ఉరిటి రామారావు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం లో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు నాగూరు ప్రాదేశిక సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో చెరువుల అభివృద్ధి నెపంతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. అలాగే గ్రామ పరిధిలో రేషన్ దుకాణాలను అధికంగా డమ్మీ డీలర్లు విధులు నిర్వహిస్తున్నారన్నారు. బినామీలు కారణంగా సరుకులు తప్పుతోవ పడుతున్నాయన్నారు. వివిధ సమస్యలపై ఆయా ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఇతర అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల ధర్నా

బొబ్బిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని డిమాండ్‌చేశారు. నిర్వాహకులకు కనీసం పదివేల రూపాయల వేతనం, బీమా సదుపాయం కల్పించాలని, ఉచితంగా గ్యాస్ అందజేయాలని కోరారు. అనంతరం ఎంఈవో గొట్టాపు వాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు వి.రామలక్ష్మి, దుప్పాడ ఆదిలక్ష్మి, ఎస్.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకు రావాలి

రాజాం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లోని చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం బొద్దాం, గారాజు చీపురుపల్లి, సోపేరు పంచాయితీల్లో సంపద కేంద్రాలను పరిశీలించారు. రూ.లక్షలు ఖర్చు చేసి సంపద కేంద్రాలను వినియోగించకుండా విడిచిపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వాటిని వినియోగంలోకి తీసుకు వచ్చి చెత్తనుంచి ఎరువు తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకవాలని ఆదేశించారు. సకాలంలో హాజరుకాని సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లు, కాలువల పనులను పరిశీలించారు.

మాలల గర్జన పోస్టర్ ఆవిష్కరణ

శృంగవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం వద్ద గురువారం మాలల గర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం విశాఖపట్టణంలో జరిగే గర్జనకు అధిక సంఖ్యలో మాలలు హాజరు కావాలని మలమహానాడు నాయకులు డోల కేశవ, బండ అప్పన్న, దేబారికి అప్పారావు, గుర్రపు శ్రీను, ఆనంద్, భరత్, సన్యాసయ్య తదితరులు కోరారు.

భూ వివాదాలు పరిష్కారమయ్యేనా?

(5వ పేజీ తరువాయి)

పది మంది తహసీల్దార్‌ల వరకు నోటీసులను జారీచేశారు. కాగా ఫ్రీహోల్డ్ జరిగిన వెంటనే జిల్లాలో 191 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేసేసారు. ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 98.32 ఎకరాలు, భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 41.56 ఎకరాలు, గజపతినగరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 39.99 ఎకరాలు, విజయనగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 10.38 ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్‌లు చేసేశారు. ఈ అవకతవకలకు సంబంధించిన ఫిర్యాదులు కూడా రెవెన్యూ సదస్సుల్లో రావొచ్చు.

ఇళ్ల స్థలాల్లోనూ కుంభకోణం

నాటి రెవెన్యూ అధికారుల అండతో పేదల ఇళ్ల స్థలాల పేరుతో బినామీలను రంగంలోకి దించారు. పట్టాకింతని డబ్బులు తీసుకొని పేదల జాబితాలో చేర్చారు. డి.పట్టా భూములను అమ్ముకున్నారు. గ్రామాల్లో ఖాళీగా వున్న ప్రభుత్వ స్థలాలను చేజిక్కించుకున్నారు. నిర్మాణాలు చేపట్టిన రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. చెరువులు, కుంటలను కప్పి లేఅవుట్‌లు వేశారు. చెరువులను ఆక్రమించి పంటలు పండిస్తున్నారు. ఇవన్నీ రెవెన్యూ సదస్సుల్లో బయటపడనున్నాయి.

సదస్సులు ఇలా

రోజుకు ఒకట్రెండు రెవెన్యూ గ్రామాల్లో ఈ సదస్సులను ఏర్పాటు చేస్తున్నారు. పెద్ద రెవెన్యూ గ్రామాల్లో రోజంతా, చిన్న రెవెన్యూ గ్రామాల్లో ఒక పూట సదస్సు ఉంటుంది. తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ శాఖ, వక్ఫ్‌బోర్డు ప్రతినిధి (అవసరమైనచోట), రిజిస్ట్రేషన్ శాఖ ప్రతినిధి, అటవీశాఖ ప్రతినిధి (అవసరమైన చోట) రెవెన్యూ సదస్సులకు హాజరుకానున్నారు. అన్నిరకాల రెవెన్యూ రికార్డులు అందుబాటులో వుంచుతారు. ఫిర్యాదుదారులకు రశీదును అందిస్తారు.

నేడు త్రిదండి చినజీయర్‌స్వామి రాక


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, బొబ్బిలి రాజవంశీయుల గురువు శ్రీత్రిదండి చినజీయర్‌స్వామి శుక్రవారం బొబ్బిలి పట్టణానికి రానున్నారని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. గురువారం స్థానిక రాజా కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం రాజా కళాశాల మైదానంలో స్వామీజీ పర్యవేక్షణలో శ్రీరామపాదుకా పట్టాభిషేకం నిర్వహిస్తారని తెలిపారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గెంబలి శ్రీనివాసరావు, పువ్వల శ్రీనివాసరావు, ఏగిరెడ్డి శ్రీధర్, కన్నూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన రైలు

గజపతినగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెంటాడ రైల్వే గేటు వద్ద గురువారం సాంకేతిక లోపంతో గూడ్స్ రైలు నిలిచిపోయింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. విజయనగరం నుంచి రాయగడ వైపు వెళ్లే గూడ్స్ రైలు సిగ్నల్ పాయింట్ వద్ద సాంకేతిక లోపంతో సుమారు అరగంట పాటు నిలిచిపోయింది. దీంతో గజపతినగరం నుంచి మెంటాడకు వెళ్లే వాహనాలు గేటుకు ఇరవైపులా బారులుతీరాయి. రైల్వే అధికారులు సమస్యను పరిష్కరించడంతో కదిలింది.

ప్రణాళికపై పునరాలోచించండి

శృంగవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక అమలు విషయమై పునరాలోచించాలని మండల యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఎంఈవోలు బి.నర్సింగరావు, పీజీ లక్ష్మిలకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు ఎంపీఏఎస్ నారాయణ, జిల్లా కార్యదర్శి జీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

16వ రోజు కొనసాగిన దీక్షలు

పార్వతీపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న నిరసన దీక్షలు 16వ రోజు కొనసాగాయి. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం వద్ద జరుగుతున్న దీక్షలకు ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు మాస్టార్ మద్దతు తెలిపారు. శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రాజేష్, రమేష్, కామేష్, మురళీ వెంకట్ తదితరులున్నారు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు అందించండి

● తొలి చందాను అందజేసిన కలెక్టర్

పార్వతీపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలు అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, పతాక నిధి ఫ్లాగ్ ప్రారంభించారు. జిల్లాలోని సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా తొలి చందాను పతాక నిధికి అందజేసి ప్రతిఒక్కరిలో స్ఫూర్తిని నింపారు. విరాళాలను ఎస్‌బీఐ అకౌంట్ నెంబర్ 52065221666, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0020931, ఎంఐసీఆర్ నెంబర్ 5350020172 డైరెక్టర్, సైనిక వెల్ఫేర్, విజయ వాడ పేరున చెక్కు, డ్రాఫ్ట్ తీసి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, విజయనగరానికి పంపాలని కోరారు. ఈనెల 7వ తేదీన ఎన్‌సీసీ విద్యార్థులు, వివిధ ప్రాంతా లకు వచ్చి విరాళాలు స్వీకరిస్తారన్నారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు.

పశు గణన సర్వే వేగవంతం చేయాలి

● జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మన్మథరావు

సీతానగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత పశు గణన సర్వేను వేగవంతం చేయాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎం.మన్మథరావు అన్నారు. గురువారం స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సీతానగరం, బలిజిపేట మండలాల పశు వైద్య సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 14,500 పాడి రైతుల ఇళ్లు ఉన్నాయని, ఇప్పటివరకు 3,859 ఇళ్లను సర్వే చేశారని, ఫిబ్రవరి 15లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. బ్రూసెల్లస్ టీకాలను 550 పశువులకు వేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన గోశాలల పనులను వేగవంతం చేయాలన్నారు. మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు మాట్లాడుతూ మొదట విడతగా 23 గోశాలలు మంజూరై, నిర్మాణాల్లో ఉన్నాయని, మరో 28 ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. జిల్లా నోడల్ అధికారి కె.ప్రసాద్‌రావు, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ ధీనకుమార్, బలిజిపేట పశు వైద్యాధికారి జి.గణేష్, గ్రామ పశు సహాయకులు పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకత పెంచాలి


బొబ్బిలి రూరల్: కలవరాయి అంగనవాడీ కేంద్రంలో ఈసీసీఈ డే

రామభద్రపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో చదువుతున్న పిల్లలకు సృజనాత్మకత పెంచే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని బాడంగి ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని కొండకెంగువ సెంటర్-2లో గురువారం ఈసీసీఈ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో చేసే కృత్యాలతో పిల్లల్లో మానసిక ఉత్సాహం పెరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త హేమ, తల్లులు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) డేను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ సూపర్‌వైజర్ ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈనెల 6 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఆర్డీవో రామ్మోహన్‌రావు తెలిపారు. గురువారం బొబ్బిలి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండల వీఆర్వోలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో రెవెన్యూ సదస్సులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులు మొక్కుబడిగా కాకుండా సమస్యల పరిష్కారం దిశగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.శ్రీను, ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ భాస్కరరావు, ఎంపీపీ ఎస్.లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి

● గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన

దత్తిరాజేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ జీతాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం గ్రీన్ అంబాసిడర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరిని పరిశుభ్రం చేసే వారికి ఇస్తున్న రూ.6వేల వేతనం నెలనెలా ఇవ్వడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఈ మండలంలో 19 నెలల నుంచి మూడు నెలల వరకు జీతాల బకాయిలు ఉన్నాయని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్లు మరణిస్తే మట్టి ఖర్చులకు రూ.15వేలు ఇవ్వాలని, ఎక్స్‌గ్రేషియో రూ.5 లక్షలు ఇవ్వాలని వారు కోరారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి, గ్రీన్ అంబాసిడర్ల మండల కార్యదర్శి నూకరాజు, మూర్తి, కృష్ణ, అప్పారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వలంటీర్ల కన్నీళ్లు కనిపించవా?



మౌనదీక్ష చేపడుతున్న అశోక్, వలంటీర్లు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రాష్ట్రంలో 2 లక్షల మంది మహిళా వలంటీర్ల ఆవేదన, కన్నీళ్లు కనిపించడం లేదా.. అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ప్రశ్నించారు. వలంటీర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో తాత్సారం చేస్తున్నందుకు నిరసనగా ఏపీ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళనకు దిగారు. నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి సమీపం లోని గాంధీ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు నోటికి ధరించి మౌనదీక్ష చేపట్టారు. కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దాకా పోరాటం కొనసాగి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు మంత్రి పర్యటన

సీతంపేట రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం సీతంపేట ఏజెన్సీలో పర్యటించనున్నట్టు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఆమె ఐటీడీఏ కార్యాలయానికి చేరుకుని, ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం ముక్కిడి పోలమ్మ వీడీవీకేను సందర్శిస్తారని తెలిపారు.

ఆహార నాణ్యతా ప్రమాణాలపై తనిఖీలేవీ?

బొబ్బిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో గల రెస్టారెంట్లు, హోటళ్లలో ఆహార నాణ్యతా ప్రమాణాలపై తనిఖీ చేసే నాథుడే కరువయ్యాడని సీపీఐ నాయకుడు కోట అప్పన్న ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బొబ్బిలిలో హోటళ్లు, దాబాలలో వారు చెప్పిందే రేటు, వారు ఇచ్చిందే నాణ్యమైన ఆహారం అన్నట్లుగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ఉన్నతాధికారులు స్పందించి ముమ్మర తనిఖీలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట బాబ్జీ, కృష్ణ ఉన్నారు.

కొత్త ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

వీరఘట్టం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా ఇళ్లు కట్టుకోవాల్సిన వారికి పీఎం అర్బన్ 2.0 పథకం కింద గృహాలు మంజూరు చేస్తున్నట్టు గృహ నిర్మాణ శాఖ ఏఈ వినోద్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. క్రొ ఇళ్ల కోసం లబ్ధిదారులు స్థానిక సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు దరఖాస్తు అందజేయాలని ఆయన సూచించారు.

జగనన్న కాలనీల్లో తనిఖీలు

సాలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుమడాం రెవెన్యూ పరిధిలో ఉన్న జగనన్న లేఅవుట్ తోపాటు నెలిపర్తి లేఅవుట్‌ను విజిలెన్స్ అధికారి అట్టాడ కామేశ్వరరావు గురువారం సందర్శించారు. గుమడాం లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు ఎందుకు పూర్తి స్థాయిలో చేపట్టలేదని, వాటికి గల కారణాలపై ఆయన అధికారులను ఆరా తీశారు. పట్టణ హౌసింగ్ అధికారి శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

చిరుజల్లులతో అవస్థలు

భామిని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఉదయం వర్షపు చినుకులు పడడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. తుఫాన్ నేపథ్యంలో వరి కోతలు వాయిదా వేసుకున్న రైతులు.. మళ్లీ వాతావరణం మార్పుతో దిగులు చెందుతున్నారు.



రాయచోటి ఘటనపై ఉపాధ్యాయుల నిరసన


బొబ్బిలి: డిప్యూటీ డీఈవో మోహనరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలి, రామభద్రపురం, బలిజిపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా రాయిచోటిలో కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న ఇజాజ్ అహమ్మద్ అనే ఉపాధ్యాయుడిపై విద్యార్థులు దాడిచేసి హతమార్చడాన్ని నిరసిస్తూ గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయులపై దాడి తగదన్నారు. ఫ్యాప్టో, యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం విద్యా శాఖాధికారులకు వినతిపత్రం అందించారు.

అధికారులతో ఎమ్మెల్సీ సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట మండల అధికారులతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గురువారం సమావేశమయ్యారు. ఉపాధి హమీ పథకం పనులపై వస్తున్న విమర్శలపై చర్చిం చారు. ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజా ప్రతినిధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ సండి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

